క్లుప్తంగా

రామాలయ గోపురం ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న నగేష్ షెట్కార్ దంపతులు

నారాయణఖేడ్: పట్టణంలోని విశిష్ట చరిత్ర గల పురాతన రామమందిరం పునర్నిర్మాణంలో భాగంగా గురువారం గోపుర ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, మాలాదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ హన్మాండ్లు సేట్, కౌన్సిలర్ వివేకానంద్, అయ్యప్ప గురుస్వాములు పాండు, దీక్షాధారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతిర్లింగం పునఃప్రతిష్ఠాపన



పునఃప్రతిష్ఠాపనలో పాల్గొన్న పీఠాధిపతులు, భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): ఆధ్యాత్మిక క్షేత్రం బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో జ్యోతిర్లింగ శివలింగం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేశారు. గురువారం ఆశ్రమ పీఠాధిపతులు 108వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహరాజ్, డా.సిద్దేశ్వర స్వామిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. అలాగే, జ్యోతిర్లింగానికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయమాత, ధనసిరి ఆశ్రమ పీఠాధిపతి వీరయ్య స్వామి, వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

పుల్‌కల్(అందోల్): మండలంలోని మిన్‌పూర్‌లో శుక్రవారం పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువులకు గర్భకోశ పరీక్షలు, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, గోపాల మిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, మాణిక్యం, శంకరయ్య పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

హత్నూర (సంగారెడ్డి): భీమా గ్రామంలో ఎల్ఐసీ సహకారంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మెదక్ ఎల్ఐసీ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ ప్రేమ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ లవంగ శ్రీనివాసు, అసిస్టెంట్ మేనేజర్ పూర్ణచందర్ రాజ్. ఎల్ఐసీ ఏజెంట్ తలారి యాదగిరి, గ్రామ ప్రత్యేక అధికారి అరవింద్, గ్రామ కార్యదర్శి రాకేష్‌కుమార్ పాల్గొన్నారు.

వరికొయ్యలను భూసారంగా వాడాలి



రైతులకు సూచనలు ఇస్తున్న నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): వరి కొయ్యలు తగలబెట్టకుండా వ్యవసాయ పొలాల్లో భూసారానికి ఉపయోగకరంగా మార్చుకోవాలని నారాయణఖేడ్ డివిజన్ ఏడీఏ నూతన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాపర్తిలో పంట పొలాలను పరిశీలించారు. పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. వరికొయ్యలు కాల్చడం వల్ల మట్టిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి భవిష్యత్తులో పంటలకు ఎక్కువ నీటి అవసరం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించండి

నారాయణఖేడ్: గ్రామపంచాయతీ ఎన్నికలు-2025 నిర్వహణకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలని నారాయణఖేడ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం గ్రామపంచాయతీల పోలింగ్ కేంద్రాలకు సంబంధించి డ్రాఫ్ట్ చివరి జాబితా తయారీ, ప్రచురణ విషయంలో సహకరించాలని కోరారు.



నాందేడ్ అకోలా రహదారిపై ప్రమాదకరంగా చెరుకు తరలిస్తున్న ట్రాక్టర్



సంగారెడ్డిలో అధిక లోడుతో చెరుకు తరలిస్తున్న లారీ

ప్రమాదకరంగా..

సంగారెడ్డి జిల్లాలో చెరుకు కోతలు జోరుగా సాగుతున్నాయి. కొంతమంది రైతులు చెరుకు తరలింపు చాలా ప్రమాదకరంగా చేస్తున్నారు. లారీ, ట్రాక్టర్ల ద్వారా పరిమితికి మించి లోడు నింపుతున్నారు. వాహన బాడీని దాటి ఎక్కువ ఎత్తులో పేర్చుతూ, ఎక్కువ పక్కకు వచ్చేలా కట్టెలు, తాళ్లు కట్టి లోడు చేస్తున్నారు. దీంతో పక్క నుంచి వెళ్లే ప్రయాణికులు, పాదచారులు భయపడుతూ వెళ్లాల్సి వస్తుంది. గతంలో కలెక్టరేట్ ఎదుట, జిల్లా ఆస్పత్రి వద్ద, ఎస్పీ కార్యాలయం దగ్గర చెరుకు లోడు వాహనాలు ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



ముంబై- హైదరాబాద్ జాతీయ రహదారిపై ..

అనుమతి లేకుండా కొనుగోళ్లు చేస్తే చర్యలు

- వట్‌పల్లి ఏఎంసీ కార్యదర్శి సునీల్

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): అనుమతి లేకుండా పత్తి కొనుగోళ్లు జరిపితే చర్యలు తీసుకుంటామని వట్‌పల్లి ఏఎంసీ కార్యదర్శి సునీల్ హెచ్చరించారు. వట్‌పల్లిలో పత్తి కొనుగోళ్లపై గురువారం 'జోరుగా జీరో దందా' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. సాక్షి కథనంపై మార్కెట్ అధికారులు స్పందించి వట్‌పల్లిలో పత్తి కొనుగోళ్లు చేస్తున్న దుకాణాల్లో తనిఖీలు చేపట్టి అనుమతి లేని 9 దుకాణాల్లోని కాంటాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి తీసుకొని మార్కెట్ ఆవరణలో కొనుగోళ్లు చేయాలని, లేకుంటే కేసులు పెడతామని హెచ్చరించారు. అనుమతి లేని కొనుగోళ్లపై నిత్యం నిఘా ఉంటుందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ప్రభుత్వ సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని కోరారు. ఆయన వెంట ఏఎంసీ సూపరింటెండెంట్ పండరినాథ్, కంప్యూటర్ ఆపరేటర్ మాణిక్యం, గంగారం తదితరులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న తూకం కాంటాలు

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశం

కంది(సంగారెడ్డి): పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గురువారం కందిలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వార్డుల విభజన తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జనాభా, ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నాయకులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. చీమ్నాపూర్ తండాలో ఓ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. 200ల ఓటర్లు ఉన్న ప్రాంతంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మధుసూదన్ రెడ్డి, సదానందచారి, ఖాజాపాషా పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆయా పార్టీల నాయకులు

సన్నరకంపై అవగాహన కల్పించాలి

నారాయణఖేడ్: యాసంగి సీజన్‌లో సైతం రైతులు సన్నరకం వరిని పండించేలా.. త్వరతగతిన నాట్లు వేసుకుని ఏప్రిల్ 15లోగా కోతలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిని లేఖలో కోరారు. ప్రభుత్వం దొడ్డురకం వరి సాగుకు బదులుగా తక్కువ కాలపరిమితి గల సన్న రకాల సాగును ప్రోత్సహిస్తోందని తెలిపారు. కనీస మద్దతు ధరను అందించడంతో పాటు సన్నరకాలకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం, ప్రభుత్వ వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటికే సన్న బియ్యం సరఫరా చేస్తుండగా ప్రజాపంపిణీ వ్యవస్థ (రేషన్ దుకాణాలు) ద్వారా సైతం సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఆయా విషయాలను రైతులకు వివరించి స్వల్పకాలిక సన్నరకాలైన తెలంగాణ సోనా, కూనారం సన్నాలు (కెఎస్ఎం1638) లాంటి రకాలను సాగుచేసుకునేలా అవగాహన కల్పించాలని లేఖలో వివరించారు.

ఔషధ పరిశ్రమ క్షేత్ర పర్యటన



పరిశ్రమలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం అధిపతి నోముల యోగిబాబు, అధ్యాపకులు శివజ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులు పాశమైలారంలోని ఎంఎస్ఎన్ ల్యాబ్స్ ఆర్‌డీ విభాగాన్ని సందర్శించారు. ల్యాబ్స్‌లో వ్యాధుల నివారణకు అవసరమైన ఔషధాల పరిశోధన, అభివృద్ధి, స్వచ్ఛత నియంత్రణ, ఔషధాల లక్ష్యాలు, మేనేజ్‌మెంట్ విధానం, ఉత్పత్తులు వాటి ప్రభావాలను, ఆర్‌డీ అధిపతి డా. శ్రీదేవి, సీనియర్ సైంటిస్టులు డా.క్రిష్ణారెడ్డి, డా.రాజేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ పర్యటన వల్ల కెమిస్ట్రీ విద్యార్థులకు పరిశ్రమ ఉత్పత్తులపై అవగాహన వస్తుందని, తద్వారా డిగ్రీ పూర్తి చేసుకున్న తరువాత వారికి ఇలాంటి ల్యాబ్స్‌లో ఉద్యోగాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ క్షేత్ర పర్యటనలో కళాశాల అధ్యాపకులు సురేష్‌కుమార్, సహాయకులు అరుణ్, అశోక్ పాల్గొన్నారు.

15 వరకు పత్తిమిల్లులు బంద్

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని ఎనిమిది పత్తిమిల్లులు శుక్రవారం నుంచి ఈనెల 15 తేదీవరకు మూడు రోజుల పాటు మూసి ఉంటాయని ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వీరశెట్టి తెలిపారు. 16 నుంచి యథావిధిగా తెరచి ఉంటాయన్నారు. పత్తి రైతులు విషయాన్ని గమనించి పత్తిని మిల్లులకు తీసుకురావాలని సూచించారు.

సేవలు మరువలేం



ఎంఈఓను సన్మానం చేస్తున్న టీచర్లు

కల్హేర్(నారాయణఖేడ్): ఉద్యోగుల సేవలు ఎవరూ మరిచిపోలేరని పీఆర్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం కల్హేర్‌లో బదిలీపై వెళ్లిన ఎంఈఓ శంకర్‌ను ఎమ్మార్సీ కార్యాలయం, వివిధ ఉపాధ్యాయ సంఘాల తరఫున సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎంలు నర్సింగ్, శైలజ కులకర్ణి, టీచర్లు గోవర్ధన్, హన్మంత్, శ్రీనివాస్, ఖలీల్ ఉన్నారు.

దేహదారుఢ్యానికి క్రీడలు దోహదం



క్రీడాపోటీల్లో తలపడుతున్న జట్లు

హత్నూర(సంగారెడ్డి): దేహదారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని ఎస్సై సుభాష్ అన్నారు. హత్నూర గురుకుల కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడల ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. గ్రామీణ ప్రాంత యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దావుద్, ఎంపీడీఓ శంకర్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరు పరచగా ఇద్దరికి రూ.2 వేలు జరిమానా, మరో ఇద్దరికి రూ.1500, మరో ఇద్దరికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌ల ఉపసంహరణకు పోరాటం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్

పటాన్‌చెరు టౌన్: లేబర్ కోడ్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ పేర్కొన్నారు. గురువారం పటాన్‌చెరులోని ఐలా భవన్‌లో సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా లేబర్ కోడ్ కార్మిక వర్గ కర్తవ్యం అనే అంశంపై జరిగిన సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లేబర్ కోడ్‌లు రద్దు కోసం కార్మికులు ఐక్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులందరూ యూనియన్‌లకు అతీతంగా ఐక్యమై పోరాడి విజయం సాధించాలన్నారు. సెమినార్‌లో సీపీఎం మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు రాజయ్య, సీపీఎం నాయకులు పాండు, మల్లేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

సస్యరక్షణతో అధిక దిగుబడులు



ఆలు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్ టౌన్: సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడి పొందవచ్చని ఏరువాక కేంద్రం సంగుపేట శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. మండలంలోని రంజోల్ రైతు వేదికలో గురువారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆలు, అల్లం సాగు, సస్యరక్షణ చర్యల గురించి సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. అల్లంలో మట్టి ఎగదొసే పద్ధతి వల్ల దుంపను సూర్యరశ్మిని నుంచి కాపాడుతుందన్నారు. గాలి, నీరు సక్రమంగా అంది పంట దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం శాస్త్రవేత్త సరిత మాట్లాడుతూ.. ఆలుకు రసం పీల్చే పురుగు, దుంపతొలుచు పురుగు, ఆకుమాడు తెగులు, బ్యాక్టీరియా కుళ్లు తెగులు ఎక్కువగా ఆశిస్తాయన్నారు. తెగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం గ్రామ పరిధిలోని ఆలు, అల్లం పంటను రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

జిన్నారం (పటాన్‌చెరు): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో చైర్ పర్సన్ రోజా, కమిషనర్ మంగతాయారు పర్యటించి దరఖాస్తుదారులతో మాట్లాడారు. ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలన్నారు. దరఖాస్తు పరిశీలన ప్రక్రియ నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. ఇంటికి వచ్చే అధికారులు, సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లికార్జున్, ఆర్వో నర్సింలు వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు ఆర్పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న ఆర్ఓ నర్సింలు

ఉద్యమకారులకు అండగా కాంగ్రెస్

- ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఉద్యమకారులకు అండగా నిలిచింది కాంగ్రెస్ పార్టీ అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంపదను దోచుకొని తెల్లాపూర్‌లో రూ.400 కోట్ల బినామీ ప్రాజెక్టుతో కోట్లు గడిస్తున్న వ్యక్తి మాజీమంత్రి హరీశ్‌రావు అని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ ద్రోహి అని సంభాషించడం సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను అధికారులపై ఉసిగొల్పి జైలుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యమకారులను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు నిర్లక్ష్యం చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి వారికి కోటి రూపాయల నగదు, 300 గజాల ఇంటి స్థలం ఇస్తే చూసి ఓర్వలేక నిందలు వేయడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ కే అతిక్, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి పాషా ఉపాధ్యక్షుడు యువరాజ్, సాయిలు ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్ : శ్రీ చైతన్య విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, సంగారెడ్డి ఎంఈఓ విద్యాసాగర్‌కు డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. బలవంతంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులను వసూలు చేస్తున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలన్నారు. చట్ట ప్రకారం ఉచితంగా విద్యను అందించాలని ఉన్నా అమలు చేయకపోవడం దారుణమన్నారు. విచారణ చేపట్టి ఉచిత విద్యను అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సాయి,శివ, దత్త పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన

సంగారెడ్డి క్రైమ్ : ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం అంకుర పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా విద్యార్థులతో కలిసి జీవితం ఎంతో విలువైంది అందరూ హెల్మెట్ ధరించాలి, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకో వాలని ప్లకార్డు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమోద్, కరస్పాండెంట్ సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరణి సేవలకు బ్రేక్!

జహీరాబాద్ టౌన్: ధరణి పోర్టల్ డేటాబేస్ వెర్షన్ అప్‌డేట్ చేయనున్నందున నాలుగు రోజుల పాటు సేవలు నిలిపేస్తున్నట్లు ఆర్డీఓ రాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, ఈ సమయంలో ధరణి పోర్టల్ సేవలు పూర్తిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ధరణి పూర్తిగా అందుబాటులో ఉండదని, ధరణి ద్వారా భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోతుందన్నారు. ధరణి సేవలు అందుబాటులోకి వచ్చే వరకు ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బాధితుడికి గురువారం ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఎల్‌ఓసీని అందజేశారు. నాగిరెడ్డిపల్లికి చెందిన ఎడ్ల లలిత అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరింది. అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి కింద రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు పరిష్కార వేదిక

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు డీఈఈ భాస్కర్ రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు విద్యుత్ డివిజన్ ఇంజినీరింగ్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించుకునే వినియోగదారులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వీరభద్రుడి హుండీ లెక్కింపు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం పరిధిలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆలయ కార్య నిర్వాహణాధికారి శశిధర్ గుప్తా ఆధ్వర్యంలో భ్రమరాంబ సేవా సమితి సభ్యులు లెక్కించారు. 78 రోజుల హుండీ ఆదాయం రూ.15,35,063 సమకూరిందని తెలిపారు.

జర్నలిస్టులపై దాడి సరికాదు

కంగ్టి(నారాయణఖేడ్): జర్నలిస్టులపై దాడికి నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం వర్కింగ్ జర్నలిస్టులు ఊరేగింపుగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మోహన్‌బాబును ఆరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మోహన్‌బాబును అరెస్ట్ చేయాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వివిధ పత్రికలు, చానళ్లకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడోత్సవాలు



జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో సీఎం కప్ క్రీడలు గురువారం ఘనంగా ముగిశాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అన్నారం హేటిరో గ్రాడ్‌లో మండల అభివృద్ధి ప్రత్యేక అధికారులు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను అందజేశారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పీటీలు క్రీడాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

రాయికోడ్(అందోల్): మండల స్థాయి సీఎం కప్ గెలుచుకున్న జట్లకు జిల్లా గ్రంథాలయల సంస్థ చైర్మన్ నాగారం అంజయ్య బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ కప్, పథకాలను క్రీడాకారులకు అందజేశారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): ఆయా క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులకు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినందన్‌రావు, ఎంఈఓ బీంసింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంబరాలు

జహీరాబాద్ టౌన్: దేశ వ్యాప్తంగా జరిగిన రైల్వే ఉద్యోగుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఘన విజయం సాధించడంతో గురువారం జహీరాబాద్‌లో ఉద్యోగులు, కార్మికులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో వికారాబాద్ బ్రాంచ్ చైర్మన్ మాధవకృష్ణ, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ కృష్ణ మాట్లాడుతూ.. యూనియన్ జోనల్ కార్యదర్శి శంకర్‌రావు, డివిజనల్ కార్యదర్శి రవీందర్ కృషి విజయం సాధ్యమైందన్నారు.